BCINEET OTT DISTRIBUTION RELEASE

# సినీ చిత్ర

THERE'S SOMETHING HERE FOR EVERYONE

Daily సినిమా e-News Paper

GET FLAT 25% OFFER*
USE CODE : NEW25
ON BCINEET OTT ALL SUBSCRIPTIONS
bcineet
Download the app now >

సంపుటి : 01 | సంచిక : 138 | ఆదివారం | 31-05-2026 | ఎడిటర్ : బోయపాటి డి కే | ఫోన్ : 7337375938

## ప్రొడ్యూసర్లకు ఊరట



కోలీవుడ్ నటుడు ధనుష్ తన పారితోషకం విషయంలో ప్రస్తుతం వార్తల్లో నిలిచారు. తాజాగా ఆయన 'కర' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు. ఈ సినిమా కోసం ఆయన ఏకంగా రూ.60 కోట్ల పారితోషకం అందుకున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ చిత్ర నిర్మాణానికి కేవలం రూ.25 కోట్ల మాత్రమే ఖర్చైనట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా, ధనుష్‌కు ఉన్న క్రేజ్ కారణంగా ఓటీటీ, శాటిలైట్, మ్యూజిక్ హక్కుల రూపంలో చిత్రానికి మంచి బిజినెస్ జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం ధనుష్ 'అమరన్' మూవీ దర్శకుడు రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు.

ఈ చిత్రం కోసం ఆయన ఏకంగా రూ.70 కోట్ల వరకు పారితోషకం తీసుకుంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇలా ధనుష్ పారితోషకం భారీగా పెరుగుతున్న నేపథ్యంలో తన వల్ల నిర్మాతలపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇకపై తాను నటించబోయే సినిమాల్లో తన సొంత నిర్మాణ సంస్థను భాగస్వామిగా ఉంచాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. అలాగే సినిమా బిజినెస్ మొత్తం పూర్తైన తర్వాతే తన పారితోషకం తీసుకోవాలనే ఆలోచనలో కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా చేస్తే నిర్మాతలపై ఆర్థిక భారం చాలా వరకు తగ్గుతుందని ధనుష్ భావిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

## 'అరసన్'లో యంగ్ బ్యూటీకి బంపర్ ఆఫర్

కోలీవుడ్ యంగ్ బ్యూటీ యోగలక్ష్మి వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలిమ్స్ ద్వారా ఫుల్ పాపులారిటీ రాబట్టుకుంది. ఇక నటనపై ఆసక్తితో 'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చిన ఆమె తన నటన, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకుల నుండి ప్రశంసలు దక్కించుకుంది. ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలవడంతో యోగలక్ష్మికి ఊహించని క్రేజ్ ఏర్పడింది. తాజాగా, ఈ అమ్మడు ఓ బంపర్ ఆఫర్ అందుకుంది. తమిళ స్టార్ డైరెక్టర్ వెట్రిమారన్, హీరో శింబు కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ సినిమా 'అరసన్'లో మెయిన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ విషయాన్ని ఓ అవార్డ్ ఫంక్షన్‌లో స్పష్టం చేస్తూ అందరినీ ఆశ్చర్య పరిచింది. "నేను 'అరసన్' సినిమాలో శింబు గారికి జోడీగా నటిస్తున్నాను. ఈ పెద్ద ప్రాజెక్ట్‌లో నాకు అవకాశం దక్కిందని తెలియగానే మొదట మా అమ్మకు ఫోన్ చేసి చెప్పాను.

ఆమె ఎంతో సంతోషపడ్డారు. వెట్రిమారన్ లాంటి గొప్ప దర్శకుడి దర్శకత్వంలో, శింబు లాంటి స్టార్ హీరోతో కలిసి పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఈ ఉత్కంఠభరితమైన ప్రయాణం కోసం నేను ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను" అంటూ యోగలక్ష్మి చెప్పుకొచ్చింది. కాగా.. మధ్యలో కొన్ని కారణాల వల్ల ఆగిన ఈ సినిమా షూటింగ్, చెన్నైలోని ఈసీఆర్ పరిసరాల్లో మళ్లీ మొదలైన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అక్కడ 'వడ చెన్నై' వాతావరణాన్ని తలపించేలా ఒక భారీ సెట్ వేసి, యోగలక్ష్మి, శింబులపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. వి క్రియేషన్స్ బ్యానర్‌పై కలైపులి ఎస్. థాను నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో ఆండ్రియా, సముద్రఖని వంటి సీనియర్ నటులు ఉన్నప్పటికీ.. కథలో శింబు సరసన యోగలక్ష్మి పాత్ర చాలా కీలకంగా, ఎంతో ప్రాధాన్యతతో ఉండబోతోందని తెలుస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఈ ఏడాది దీపావళి కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.




## జక్కన్నకు షాక్

### వారణాసి నుంచి మరో లీక్ !

ప్రిన్స్ మహేష్ బాబు, రాజమౌళి దర్శకత్వంలో వస్తున్న లేటెస్ట్ మూవీ వారణాసి. ఈ సినిమా షూటింగ్ చాలా వేగంగా సాగుతోంది. వచ్చే ఏడాది రిలీజ్ కానున్న ఈ సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్ గా మెరువనున్నారు. అయితే ఈ భారీ బడ్జెట్ సినిమాకు ఊహించని షాక్ తగిలింది. ఈ సినిమాకు మొదటి నుంచి లీక్ ల బెడద ఎదురు అవుతూనే ఉంది. మొన్న ఒడిస్సా లో జరిగిన తొలి షెడ్యూల్ షూటింగ్ టైంలో కొన్ని సీన్స్ వైరల్ గా మారాయి.

ఇప్పుడు కీలకమైన ఉగ్రభట్టి గుహ సన్నివేశానికి సంబంధించిన భారీ సెట్ స్టిల్స్ సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. దీంతో సీరియస్ అయిన జక్కన్న, లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారట. ఇలా ప్రతి సీన్ లీక్ చేస్తే.. ఎలా అని ఇప్పటికే చిత్ర బృందం సభ్యులకు వార్నింగ్ ఇచ్చారట. ఇది ఇలా ఉండగా పాన్ ఇండియా రేంజ్ లో వస్తున్న ఈ సినిమా.. టైం ట్రావెల్, మైథాలజీ నేపథ్యంలో వస్తున్నట్లు టాక్. ఇక ఈ మూవీలో రుద్ర అనే శివ భక్తుడి పాత్రలో మహేష్ బాబు మెరుస్తున్నారు.




## 'సిగ్మా' రిలీజ్ డేట్ విడుదల




టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న సరికొత్త యాక్షన్ అడ్వెంచర్, కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రం 'సిగ్మా'. కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం దళపతి విజయ్ తనయుడు జాసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా సినిమా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. ఇందులో సందీప్ కిషన్ సరసన 'జాతి రత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తుండగా, మరో గ్లామరస్ బ్యూటీ కేథరీన్ థ్రెసా ఒక కీలక పాత్రలో కనిపించబోతోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

ఈ క్రమంలోనే.. మూవీ మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చారు. అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ సినిమా రిలీజ్ డేట్‌ను చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ క్రేజీ యాక్షన్ అడ్వెంచర్ మూవీని జూలై 31న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. అంతేకాకుండా సందీప్ కిషన్ పోస్టర్‌ను కూడా విడుదల చేసి హైప్ క్రియేట్ చేశారు. ఇందులో ఆయన రక్తం కారుతున్న పారను పట్టుకుని ఆగ్రహంతో కనిపించారు. ఈ పోస్టర్ చూస్తుంటే.. బాక్సాఫీసు వద్ద సందీప్ మాస్ యాక్షన్ యాక్షన్స్‌తో చరిత్ర సృష్టించబోతున్నట్లు అర్థమవుతోంది. ఒకవైపు సందీప్ కిషన్ మార్క్ కామెడీ, యాక్షన్.. మరోవైపు విజయ్ కొడుకు జాసన్ సంజయ్ డైరెక్షన్ కావడంతో ఈ 'సిగ్మా' సినిమాపై అటు టాలీవుడ్‌తో పాటు ఇటు కోలీవుడ్‌లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.

# సినీ-చిత్ర

THERE'S SOMETHING HERE FOR EVERYONE

Daily సినిమా e-News Paper

సంపుటి : 01 | సంచిక : 139 | ఆదివారం | 31-05-2026 | ఎడిటర్ : బోయపాటి డి కే | ఫోన్ : 7337375938







## యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహించేందుకు "టీఎఫ్‌సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ - 2026" నిర్వహిస్తున్నాం : టీఎఫ్‌సీసీ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్



చిత్ర పరిశ్రమలో కొత్త ప్రతిభను ప్రోత్సహించేందుకు తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) ముందుకొచ్చింది. తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని "టీఎఫ్‌సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ - 2026"ను టీఎఫ్‌సీసీ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ప్రకటించారు. ఈ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదు. 5 నుంచి 25 నిమిషాల నిడివి గల షార్ట్ ఫిలింలను ఔత్సాహిక దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులు పంపవచ్చు. ఎంట్రీలను జూన్ 13వ తేదీ వరకు స్వీకరిస్తారు. జ్యూరీ ఎంపిక చేసిన విజేతలకు జూన్ 21న హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్నామని, ఇకపై ప్రతి ఏడాది దీన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో గుర్తింపు పొందిన పలువురు హీరోలు, దర్శకులు షార్ట్ ఫిలింల నుంచే తమ ప్రయాణాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు.



ఈ ఫెస్టివల్‌లో బెస్ట్ స్టోరీ, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ హీరో, బెస్ట్ హీరోయిన్, బెస్ట్ యాక్టర్, బెస్ట్ కో-ఆర్టిస్ట్, బెస్ట్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ సినిమాటోగ్రాఫర్, బెస్ట్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, బెస్ట్ సపోర్టింగ్ యాక్ట్రెస్, జ్యూరీ అవార్డు, బెస్ట్ ప్రొడ్యూసర్, బెస్ట్ జర్నలిస్ట్ (ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా), బెస్ట్ ఫోటో జర్నలిస్ట్, బెస్ట్ కెమెరామెన్ తదితర దాదాపు 20 విభాగాల్లో అవార్డులు అందజేస్తామని తెలిపారు. కొత్త ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. టీఎఫ్‌సీసీ వైస్ ఛైర్మన్ గురురాజ్ మాట్లాడుతూ, కొత్త టాలెంట్‌ను వెలుగులోకి తీసుకురావడంలో డా. రామకృష్ణ గౌడ్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా ఫెస్టివల్ నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. టీఎఫ్‌సీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అక్సాఖాన్ మాట్లాడుతూ, షార్ట్ ఫిలిం ఫెస్టివల్ ద్వారా ఎంతోమందికి తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభిస్తోందని చెప్పారు. ఇప్పటికే ఎంట్రీలు రావడం ప్రారంభమైందని, జూన్ 13లోపు తమ చిత్రాలను పంపాలని కోరారు. టీఎఫ్‌సీసీ వైస్ ఛైర్మన్ అల్లా భక్షు మాట్లాడుతూ, ఇతర ఫెస్టివల్స్ భారీ ఎంట్రీ ఫీజులు వసూలు చేస్తున్న నేపథ్యంలో ఉచితంగా అవకాశం కల్పించడం విశేషమని తెలిపారు. షార్ట్ ఫిలింల ద్వారా అనేకమంది నటీనటులు, దర్శకులు ఎదిగారన్నారు. టీఎఫ్‌సీసీ కోఆర్డినేషన్ కమిటీ సెక్రటరీ ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, కొత్తవారిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ ఫెస్టివల్‌ను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. దర్శకులు, నటులు, సాంకేతిక నిపుణులు తమ ఎంట్రీలను పంపి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

టీఎఫ్‌సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ – 2026 కొత్త ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే వేదికగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు.

## వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించే "జులుం"



సమాజంలో నిశ్శబ్దంగా నలిగిపోతున్న బాధలకు స్వరం అందించాలనే లక్ష్యంతో ఇండియన్ ఫిల్మ్ మేకర్స్, ఆర్.కే. బ్లాక్‌బస్టర్ సంస్థల సంయుక్త నిర్మాణంలో రూపొందుతున్న తెలుగు కుటుంబ కథాచిత్రం "జులుం" ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదు, మౌనంగా భరించబడుతున్న అన్యాయాలపై ప్రశ్నించే సామాజిక ప్రతిధ్వని.

చిత్రీకరణను పూర్తిగా ముగించుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ముఖ్యంగా చిత్రంలోని ఒక ప్రత్యేక గీతం కోసం చిత్రబృందం ఎంతో శ్రద్ధ తీసుకుంది. ఢిల్లీ, ముంబై నగరాల నుంచి నృత్య కళాకారిణి రూప్స భట్టాచార్యతో పాటు ఇద్దరు ప్రముఖ కొరియోగ్రాఫర్లను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ అనంతరం రెండు రోజుల పాటు ఈ పాటను అత్యంత వైభవంగా చిత్రీకరించారు.

సంగీతం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుంది. ఐదు పాటలతో రూపొందిన ఈ చిత్రంలోని ప్రతి గీతం హృదయాన్ని తాకే సాహిత్యంతో పాటు ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచేలా రూపొందించబడింది. ముఖ్యంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకునే అంశాలుగా నిలుస్తాయని చిత్ర యూనిట్ వెల్లడించింది.

## హర్రర్ సస్పెన్స్ థ్రిల్లర్ "నైరా" ఘనంగా ప్రారంభం



విక్టరీ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెంబర్-2గా రూపొందుతున్న హర్రర్ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం "నైరా" ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్రంలో హీరోలుగా వెంకట్, మధిర నియోజకవర్గం బోనకల్ మండలం రాయన్నపేట గ్రామానికి చెందిన యువ నటుడు ప్రవీణ్ చిన్నా నటిస్తుండగా, హీరోయిన్లుగా భార్గవి రోజా మరియు హైదరాబాద్‌కు చెందిన స్వర్ణలత నటిస్తున్నారు.

చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆర్‌కే ఫౌండేషన్ ఛైర్మన్ దోర్నాల రామకృష్ణ క్లాప్ కొట్టి చిత్రాన్ని ప్రారంభించారు. మధిర పట్టణానికి చెందిన బోల్లెద్దు సంధ్య కెమెరా స్విచ్ ఆన్ చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రస్తుతం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఈ షూటింగ్‌లో ఖమ్మానికి చెందిన నటుడు కోటయ్య, ఆరెగూడెం గ్రామానికి చెందిన చారీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

చిత్రీకరణ మధిర, వైరా, ఖమ్మం పరిసర ప్రాంతాల్లో కొనసాగనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. హర్రర్, సస్పెన్స్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుందని నిర్మాతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ చిత్రానికి వరుణ్ ఎస్ఎస్‌వీ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా, భాస్కర సూర్య సహ దర్శకుడిగా పనిచేస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను సురేష్ పెనుగొండ నిర్వహిస్తున్నారు.


"నైరా" చిత్రానికి సంబంధించిన మరిన్ని విశేషాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.

## బాలయ్య పుట్టినరోజు కానుకగా జూన్ 10న 'భైరవ ద్వీపం' రీ రిలీజ్

తెలుగు సినీ పరిశ్రమలో రీ రిలీజ్‌ల ట్రెండ్ మరోసారి జోరందుకుంది. ఒకప్పుడు ప్రేక్షకులను అలరించిన క్లాసిక్ చిత్రాలు ఇప్పుడు ఆధునిక సాంకేతికతతో 4K క్వాలిటీలో మళ్లీ ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. ఇటీవల విడుదలైన మురారి, పోకిరి, జల్సా, ఘరానా మొగుడు, బిల్లా, చెన్నకేశవ రెడ్డి, ఖుషీ, సింహాద్రి, తొలిప్రేమ, బిజినెస్‌మ్యాన్ వంటి చిత్రాలు రీ రిలీజ్‌లో విశేష ఆదరణ పొందడంతో పాటు మంచి వసూళ్లు కూడా సాధించాయి.



ఈ నేపథ్యంలో నందమూరి బాలకృష్ణ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఫాంటసీ అడ్వెంచర్ క్లాసిక్ 'భైరవ ద్వీపం' మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా జూన్ 10న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రీ రిలీజ్ చేయనున్నట్లు చిత్ర వర్గాలు ప్రకటించాయి.



దర్శక దిగ్గజం సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అప్పట్లో సాంకేతిక పరంగా, కథా పరంగా తెలుగు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇందులో నందమూరి బాలకృష్ణ సరసన రోజా హీరోయిన్‌గా నటించగా, చిత్రంలోని విజువల్స్, సంగీతం, సాహస సన్నివేశాలు నేటికీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నాయి.

ఫాంటసీ, జానపద అంశాలతో రూపొందిన ఈ ఎవర్‌గ్రీన్ క్లాసిక్‌ను మళ్లీ థియేటర్లలో చూసే అవకాశం రావడంతో బాలయ్య అభిమానులు ఇప్పటికే సంబరాలు ప్రారంభించారు. జూన్ 10న విడుదల కానున్న 'భైరవ ద్వీపం' రీ రిలీజ్‌కు భారీ స్పందన లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



BCINEET
OTT DISTRIBUTION RELEASE

# సినీ చిత్ర

THERE'S SOMETHING HERE FOR EVERYONE

GET FLAT 25% OFFER*
USE CODE : NEW25
ON BCINEET OTT ALL SUBSCRIPTIONS
bcineet
Download the app now >

Daily సినిమా e-News Paper

సంపుటి : 01 | సంచిక : 138 | ఆదివారం | 31-05-2026 | ఎడిటర్ : బోయపాటి డి కె | ఫోన్ : 7337375938

## కడుపుబ్బా నవ్వించేందుకు వస్తున్న "ఏజెంట్ అంజి"

### –జబర్దస్త్ ఫణి ప్రధాన పాత్రలో వెబ్ సిరీస్



శ్రీ లక్ష్మీ శ్రీనివాస ఫిలిమ్స్ మరియు టాలీవుడ్ టైమ్స్ బ్యానర్లపై తల్లాడ సాయి కృష్ణ నిర్మాతగా, రామ్ తవ్వ సహ నిర్మాతగా రూపొందుతున్న వినోదాత్మక వెబ్ సిరీస్ "ఏజెంట్ అంజి" ప్రేక్షకుల ముందుకు రానుంది. జబర్దస్త్ ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందిన ఫణి ఈ సిరీస్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.

డిటెక్టివ్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సిరీస్‌లో ఆకెళ్ల, కిషోర్ దాస్, రవి రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ వెబ్ సిరీస్ ప్రస్తుతం డబ్బింగ్ మరియు పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా జరుపుకుంటోంది.

ఈ సందర్భంగా హీరో జబర్దస్త్ ఫణి మాట్లాడుతూ, "డిటెక్టివ్ అంజి పాత్ర ద్వారా ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించబోతున్నాను. మంచి కథ, ఆసక్తికరమైన కథనంతో ఈ ప్రాజెక్ట్‌ను సిద్ధం చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసేలా 'ఏజెంట్ అంజి' ఉండబోతోంది" అని తెలిపారు.

నటుడు ఆకెళ్ల మాట్లాడుతూ, "ఈ సిరీస్‌లో అంజికి మామ పాత్రలో కనిపిస్తాను. కామెడీతో ప్రేక్షకులను అలరించే విభిన్నమైన పాత్ర ఇది. ఎప్పటిలాగే ప్రేక్షకుల ఆదరణ మాకు ఉండాలని కోరుకుంటున్నాను" అన్నారు.

మరో కీలక పాత్రధారి కిషోర్ దాస్ మాట్లాడుతూ, "ఈ సిరీస్‌లో నేను 'రేణు స్వామి' పాత్రలో నటిస్తున్నాను. నేటి కాలంలో సెల్‌ఫోన్ మన జీవితంలో విడదీయరాని భాగంగా మారింది. ఎప్పుడూ సెల్‌ఫోన్‌లోనే మునిగిపోయే స్వామిజీ పాత్రలో ప్రేక్షకులను అలరించబోతున్నాను" అని చెప్పారు.

ఈ వెబ్ సిరీస్‌లో రవి రెడ్డి, హేమ, స్వాతి నాగరాజు, రాంకీ, వినోద్ ఫిల్మ్ అకాడమీ విద్యార్థులు భాను, మానస, శ్రీనివాస్, లావణ్య, విజయ్ రెడ్డి, శ్రీధర్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

సాంకేతిక విభాగంలో శివ రాథోడ్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, రామ్ తవ్వ సంగీతం సమకూరుస్తున్నారు. సాహిత్ ఎడిటింగ్‌తో పాటు దర్శకత్వ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

వినోదంతో పాటు ఆసక్తికరమైన మిస్టరీ అంశాలతో రూపొందుతున్న "ఏజెంట్ అంజి" త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. కామెడీ ప్రియులకు ఈ వెబ్ సిరీస్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర యూనిట్ విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

### పోసాని, ఛోటా కె. నాయుడు చేతుల మీదుగా

## "6AM Love" ప్రారంభం



నూతన నిర్మాణ సంస్థ సహస్ర ప్రొడక్షన్స్ లోగో ఆవిష్కరణతో పాటు, ఆ సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన వెబ్ సిరీస్ "6AM Love" టైటిల్ లాంచ్ కార్యక్రమం హైదరాబాద్‌లో సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

ఈ వెబ్ సిరీస్‌ను లక్ష్మీకాంత్ కె.బి నిర్మిస్తుండగా, సుధాకర్ అక్కినపల్లి దర్శకత్వం వహించడంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నటుడు, రచయిత పోసాని కృష్ణమురళి క్లాప్ కొట్టగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఛోటా కె. నాయుడు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ నటులు కౌశల్ మరియు జోష్ రవి దర్శకుడికి స్క్రిప్ట్ అందజేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ, "సహస్ర ప్రొడక్షన్స్ ద్వారా లక్ష్మీకాంత్ గారు నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టడం సంతోషకరం. దర్శకుడు సుధాకర్ అక్కినపల్లి దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. '6AM Love' టైటిల్ వినూత్నంగా, ఆకర్షణీయంగా ఉంది. ఈ వెబ్ సిరీస్ ఘన విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు.

కౌశల్ మాట్లాడుతూ, "టైటిల్ చాలా ఫ్రెష్‌గా అనిపించింది. ప్రస్తుతం వెబ్ సిరీస్‌లకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. మంచి కంటెంట్ ఉంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతం అవుతుందనే నమ్మకం ఉంది" అని తెలిపారు.

జోష్ రవి మాట్లాడుతూ, "విభిన్నమైన కథాంశాలతో వస్తున్న వెబ్ సిరీస్‌లకు మంచి ఆదరణ లభిస్తోంది. దర్శకుడు ఎంపిక చేసిన కథ యూత్‌ను ఆకట్టుకునేలా ఉంది. '6AM Love' మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను" అన్నారు.

నిర్మాత లక్ష్మీకాంత్ కె.బి మాట్లాడుతూ, "మా తొలి నిర్మాణ ప్రయాణాన్ని ఆశీర్వదించేందుకు విచ్చేసిన పోసాని కృష్ణమురళి గారు, ఛోటా కె. నాయుడు గారు, కౌశల్, జోష్ రవి గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు. మంచి కంటెంట్‌తో కూడిన కథలను ప్రేక్షకులకు అందించాలన్నదే మా లక్ష్యం. అత్యుత్తమ నిర్మాణ విలువలతో ఈ వెబ్ సిరీస్‌ను తెరకెక్కిస్తున్నాము" అని తెలిపారు.

దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ సుధాకర్ అక్కినపల్లి మాట్లాడుతూ, "నా కథను నమ్మి అవకాశం ఇచ్చిన నిర్మాత లక్ష్మీకాంత్ గారికి ధన్యవాదాలు. '6AM Love' నేటి యువత ఆలోచనలకు దగ్గరగా ఉండే అందమైన కథ. ఈ కథకు నా దర్శకత్వం, సినిమాటోగ్రఫీ ద్వారా పూర్తి న్యాయం చేసే ప్రయత్నం చేస్తాను. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో ప్రకటిస్తాం" అని వెల్లడించారు.

## ఎన్టీఆర్ జయంతి సందర్భంగా

# వినోద్ ఫిల్మ్ అకాడమీ 6వ వార్షికోత్సవం




తెలుగు సినీ పరిశ్రమకు ఎన్నో ప్రతిభావంతులైన నటీనటులను అందిస్తూ తనదైన గుర్తింపు తెచ్చుకున్న వినోద్ ఫిల్మ్ అకాడమీ 6వ వార్షికోత్సవ వేడుకలను మే 28న మహానటుడు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఘనంగా నిర్వహించింది.

ఈ సందర్భంగా అకాడమీ వ్యవస్థాపకులు వినోద్ నువ్వుల మాట్లాడుతూ, "మహానటుడు ఎన్టీఆర్ గారి జయంతి రోజున మా అకాడమీని ప్రారంభించడం ఎంతో గర్వకారణం. గత ఆరు సంవత్సరాలుగా అనేకమంది ప్రతిభావంతులైన కళాకారులను తీర్చిదిద్ది సినీ పరిశ్రమకు పరిచయం చేయడం ఆనందంగా ఉంది" అని తెలిపారు.



అకాడమీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "ప్రపంచ సినీ చరిత్రలో తన నటనతో చెరగని ముద్ర వేసిన మహానటుడు ఎన్టీఆర్ గారు ప్రతి నటుడికి ఆదర్శప్రాయులు. ఆయన వారసత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాము" అని అన్నారు.

ఈ వేడుకల్లో అకాడమీ ఫ్యాకల్టీ సభ్యులు బబ్లు, విజయభారత్, ఈశ్వర్, ఉషాశ్రీ పాల్గొనగా, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ నటులు, దర్శకులు, నిర్మాతలు హాజరయ్యారు. వారిలో తల్లాడ సాయికృష్ణ, గుర్రపు విజయ్ కుమార్, ప్రణయ్ రాజ్, అప్పు శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

అలాగే వినోద్ ఫిల్మ్ అకాడమీలో శిక్షణ పొంది ప్రస్తుతం వివిధ సినిమాలు, వెబ్ సిరీస్‌లలో నటిస్తున్న ప్రదీప్, రాము, మురళి తదితర కళాకారులు హాజరై తమ అనుభవాలను పంచుకుంటూ విద్యార్థులకు ప్రోత్సాహాన్నిచ్చారు.

ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, "వినోద్ ఫిల్మ్ అకాడమీ నుంచి శిక్షణ పొందిన కళాకారులు సినీ రంగంలో విజయవంతంగా రాణించడం అభినందనీయం. భవిష్యత్తులో మరింత మంది ప్రతిభావంతులను తెలుగు చిత్ర పరిశ్రమకు అందించాలని ఆశిస్తున్నాము" అని పేర్కొన్నారు.

ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించిన ఈ వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థుల సందడి, అతిథుల ప్రసంగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అకాడమీ భవిష్యత్తులో మరిన్ని శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి యువతకు సినీ రంగంలో అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

